ధర లేక దిగాలు

- గిట్టుబాటు ధర లేక రైతుల ఇళ్లలో మూలుగుతున్న మినుములు, అలసందలు
- వర్షానికి తడిసిన గింజలు కొనుగోలు చేసేందుకు ముందుకు రాని వ్యాపారులు
- రైతు గోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం

హనుమంతునిపాడు:

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడం, దళారులు ధర దక్కనీయకపోవడంతో వచ్చిన పంటను ఇళ్లలోనే నిల్వ చేసుకొని గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్నారు. నేటికీ గింజ అమ్ముడుపోలేదు. రైతుల ఇళ్లలో పంట ఉత్పత్తులు మూలుగుతున్నాయి. ఈ ఏడాది మండలంలో మినుము 4 వేల ఎకరాలు, అలసంద 3500 ఎకరాల్లో సాగు చేశారు. వర్షం దెబ్బకు ముందస్తుగా సాగు చేసి పండిన మినుములు తడిసి దెబ్బతిన్నాయి. లేత అదునుగా సాగు చేసిన పంటలు తడుపు లేకుండా కొంత పంట వచ్చింది. రైతులు పండించిన పంటను ఇళ్లకు తెచ్చి ఇళ్లలోనే నిల్వ ఉంచారు. నేటికీ గింజ కూడా అమ్ముడు పోలేదు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా గిట్టుబాటు ధర కల్పించి పంట కొనుగోలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. వ్యాపారులు తడిసిన పంటను సగానికి సగం రేటుకు అడుగుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కూడా లేవు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి పోతున్నాయి. వ్యాపారులు అడిగిన ధరకు ఇస్తే వడ్డీలు కూడా కట్టే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులను రానివ్వడం లేదు. మినుములు తడిసిన గింజలకు క్వింటా రూ.4500 మించి ధర రానివ్వడం లేదు. తడుపు రాని మినుములు రూ.6 వేల వరకు మించి ధర ఇవ్వడం లేదు. అలసందలు రూ.5 వేలు మించి ధర పలకడం లేదు. తడిసిన అలసందలు రూ.4 వేలు మించి ధరను వ్యాపారులు అడగడం లేదు. వ్యాపారులు కుమ్మక్కై ధర పెరగనివ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక ఇళ్లలోనే నిల్వ ఉంచుకుని ధర కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఆర్బీకేలలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మినుములు, అలసందలు, కందులు, వడ్లు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



మోరవారిపల్లిలో రైతుల ఇళ్లలో నిల్వ ఉన్న మినుములు



పాతమల్లవరం రైతు ఇంట్లో నిల్వ ఉన్న అలసందలు

గిట్టుబాటు ధర లేక ఇళ్లలో నిల్వ చేశాను



వ్యాపారులు సగానికి సగం రేటుకు అడ్డంగా అడుగుతున్నారు. వ్యాపారులంతా ఒక్కటై ఇతర వ్యాపారులను ఎక్కి రానివ్వలేదు. మినుములు 100 బస్తాలు, అలసందలు 150 బస్తాలు పండించాను. గిట్టుబాటు ధర రాకపోవడంతో నిల్వ ఉంచాను. మంచి ధర కోసం ఎదురు చూస్తున్నాను. వ్యాపారులు అడిగిన ధరకు ఇస్తే పెట్టుబడి కూడా రాదు. తెచ్చిన అప్పులకు వడ్డీలకు కూడా సరిపోవు. ప్రభుత్వం రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలి.

– గాయం సుబ్బారెడ్డి, హాజీపురం, హనుమంతునిపాడు మండలం

క్లుప్తంగా

ఘనంగా అంకాళమ్మ, పోలేరమ్మ తిరునాళ్ల



గ్రామోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కదిరి, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని శీలం వారిపల్లెలో గ్రామదేవతలు అంకాళమ్మ, పోలేరమ్మ తిరునాళ్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విశిష్ట పూజలు చేశారు. అనంతరం అమ్మవార్లకు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ టి.బాబూరావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు మునగల నారాయణరెడ్డి, తిరుపతయ్య, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కొండపి: హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కె.ఉప్పలపాడులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి పుష్పలత ప్రారంభించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు రాఘవేంద్ర శర్మ, ప్రెసిడెంట్ సుధాకర్, సెక్రటరీ మధు, వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, సభ్యులు రవి, చిన్నకోటయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



టీడీ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

పామూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వీఆర్‌ఏలు బుధవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాస్‌రెడ్డి, ఇమ్మానియేలు మాట్లాడుతూ నైట్‌డ్యూటీలు, ఇసుక, రైస్‌మిల్స్ వద్ద డ్యూటీలు వెంటనే నిలిపివేయాలన్నారు. తెలంగాణలో ఇస్తున్నట్లు నామినీలతో సహా వీఆర్‌ఏలకు పే స్కేల్ జీతాలు చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మన్, రికార్డ్ అసిస్టెంట్, డ్రైవర్ పోస్టులను అర్హులైన వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని కోరారు. షేక్.బీబీ, నారాయణమ్మ పాల్గొన్నారు.

రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి



రీసర్వే గ్రామసభలో మాట్లాడుతున్న డీటీ వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం(పామూరు): భూముల రీసర్వే పారదర్శకంగా నిర్వహించేందుకు రైతులు అధికారులకు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ పొన్నరుసు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని నల్లజనంపాడులో బుధవారం రెండో విడత భూసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ రీసర్వే బృందానికి రైతులు తమ పొలాల ధ్రువీకరణ పత్రాలు చూపి భూములను రీ సర్వే చేయించుకోవాలన్నారు. వివాదాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సర్పంచ్ పందిళ్ల నాగమణి, ఎంపీటీసీ బి.వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓ కె.మాల్యాద్రి, గ్రామ సర్వేయర్ తెల్లగొర్ల సుప్రియ, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి



పౌష్టికాహారం పై అవగాహన కల్పిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న సీడీపీఓ మాధవీలత

పొన్నలూరు: గర్భిణుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ ఉమేర అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ పథకం ద్వారా ప్రతి నెల 9వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన మందులను అందజేస్తారన్నారు. ఎలాంటి సమస్యలు తేకుండా గర్భిణులు ఆరోగ్య కేంద్రంలో ప్రసవించేలా అవగాహన పొందాలన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని కామేపల్లి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎల్ విజయ తెలిపారు. పైడిపాడు అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్బవతులు, బాలింతలు, చిన్నారులకు బరువు తూయించారు. బరువు తక్కువగా ఉన్నవారు ఏవిధమైన పౌష్టికాహారం తీసుకోవాలో వివరించి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గురించి తెలియజేశారు.

కొండపి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ మాధవీలత అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల బరువులను ఎప్పటికప్పుడు కొలత వేస్తూ బరువు తగ్గకుండా మంచి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. సూపర్‌వైజర్ విక్టోరియా రాణి తదితరులు పాల్గొన్నారు.

పామూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతకు దూరంగా ఉండవచ్చని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని బుక్కాపురం, మోత్రావులపాడు అంగన్‌వాడీ గ్రామాల్లో బుధవారం పౌష్టికార పక్షోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహారాన్ని పంపిణీచేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంవీఎస్.పార్వతి, యారవ శ్రీనివాసులు, సయ్యద్ అమీర్‌బాబు, ఎన్‌జీఓ నాయబ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న జి.శ్రీనివాసులు

కనిగిరిరూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికుల సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆర్ మాలకొండయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.శ్రీనివాసులు, జీవీ కొండారెడ్డిలు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తొంగలో తొక్కుతున్నారన్నారు. అంగన్‌వాడీలకు రిటైర్డుమెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని మున్సిపల్ కార్మికుల సమ్మెకాలపు 16 నెలల జీతాలు ఇవ్వాలని, సంక్రాంతి కానుక చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు పీసీ కేశవరావు, బడుగు వెంకటేశ్వర్లు, పీ మహేష్, రజనీ, కుమారి, రాజ్యలక్ష్మీ, శేషయ్య, బాలస్వామి, పిచ్చయ్య, నరేంద్ర, ఆర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

103 బేళ్లు తిరస్కరణ



కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 103 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. వేలం కేంద్రానికి నేతివారిపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 559 బేళ్లను తీసుకురాగా 456 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.240, సరాసరి ధర రూ.269.37గా నమోదైంది. వేలంలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. గురువారం మహావీర జయంతి సందర్భంగా వేలానికి సెలవు ప్రకటించినట్లు నిర్వహించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



టంగుటూరులో ప్రజా వేదిక నిర్వహిస్తున్న పీడీ జోసఫ్, అధికారులు

టంగుటూరు: ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జోసఫ్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. తనిఖీ బృందం ఆ ఆ గ్రామాల్లో తనిఖీ చేసిన పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా పీడీ జోసఫ్ మాట్లాడుతూ మండలంలోని 18 పంచాయతీల్లో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌లలో 523 పనులకు రూ.7.60 కోట్ల విలువైన పనులు జరిగాయన్నారు. ఇందులో రూ.6.66 లక్షల అవకతవకలు గుర్తించి రూ.1.96 లక్షల రికవరీకి ఆదేశించామన్నారు. ఏపీడీ వందర్‌మ్యాన్, తనిఖీ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సోమ సుబ్బారావు

కనిగిరిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు అన్నారు. కనిగిరి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల హెచ్‌ఎంలు, ఎంఈఓలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకత్వ శిక్షణ కార్యక్రమాల్లో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలని, నైపుణ్యాలు పెంపొందించుకొని వనరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలల్లో అభ్యాసంస్థగా, అభివృద్ధి చేయడానికి సమర్థవంతమైన వ్యూహాలను రూపొందించాలన్నారు. విద్యార్థుల్లో ఉన్న సామర్థ్యాభివృద్ధిని హెచ్‌ఎంలు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఎల్‌డీపీ, ఫీడ్ బ్యాక్, ఆచరణ, డైట్ తదితర అంశాలను సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు రాజాల కొండారెడ్డి, జి.సంజీవి, యూవీ నారాయణరెడ్డి, రాచగుండ్ల శ్రీనివాసులు, ఎనుబరి కరుణకుమారి, ప్రధానోపాధ్యాయులు, హెచ్‌ఎంలు, పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు సమష్టిగా పనిచేద్దాం



దద్దాల నారాయణ యాదవ్‌ను, మాదాల వెంకట సుబ్బారావును సన్మానిస్తున్న నేతలు

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ పటిష్టతకు అందరం సమష్టిగా పనిచేద్దామని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమితులైన మాదాల వెంకట సుబ్బారావు, వ్యాపారస్తులు పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ రానున్న రోజులు వైఎస్సార్ సీపీవే నన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. మాదాల వెంకట సుబ్బారావు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఉన్నత పదవిని ఇచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డికి, పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం, వ్యాపార సంఘ నాయకులు విష్ణు, కొమ్మి కాటం రాజు, రాగి బ్రహ్మయ్య, సవరం రాజేష్, శ్యామల సాంబిరెడ్డి, రమణారెడ్డి, ఇండ్లా నందకిషోర్, ఇండ్లా విష్ణు వర్ధన్, ఇండ్లా రామకృష్ణా, రాగి మహాలక్ష్మమ్మ, బాపట్ల రామకృష్ణా, వేణుబాబు పాల్గొన్నారు.

దేవస్థాన భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



ఆక్రమణకు గురైన వేణుగోపాలస్వామి స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

పామూరు: దేవస్థాన భూములను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దేవదాయ, ధర్మాదాయ అసిస్టెంట్ కమిషనర్ ఎం పానకాలరావు అన్నారు. పామూరులోని మదన వేణుగోపాలస్వామికి చెందిన భూములను కొందరు ఎన్‌ఓసీకోసం కమిషనర్ కోసం దరఖాస్తు చేసుకోగా కమిషనర్ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో ఏసీ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక నెల్లూరురోడ్డులో ఉన్న మదన వేణుగోపాలస్వామికి చెందిన దేవదాసి భూములు సర్వేనంబర్ 365/2 లోని 2.19 ఎకరాలు, 365/3 లోని 2.10 ఎకరాల్లో నిర్మించిన శ్రీనగర్ కాలనీ, అదేవిధంగా మద్దెలసర్వీస్ భూములు సర్వేనంబర్ 322/7 లో 0.56 సెంట్లు, 322/11 లోని 0.55 సెంట్లులోని పెట్రోల్‌బంక్, షాపింగ్‌కాంప్లెక్సెను ఏసీ పానకాలరావు, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు పరిశీలించారు. దీనిపై నివేదికను కమిషనర్‌కు పంపనున్నట్లు తెలిపారు.

పెంచిన ధరలు వెంటనే తగ్గించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్

కొండపి: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్ మాట్లాడుతూ సామాన్యుడి నడ్డి విరిచేలా గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచిందన్నారు. విదేశాల్లో చమురు ధరలు తగ్గుతుంటే, మన దేశంలో పెట్రోల్, గ్యాస్ రేట్లు పెంచడం శోచనీయమన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు వై రూబెన్, మల్లెల చిన్న పేతురు, గడ్డం వందనం, శ్రీనివాసులు, జయరావు, రమణమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల దాడులు

- రూ.1,23,400 అపరాధ రుసుం విధింపు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

హనుమంతునిపాడు: మండలంలోని నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. దాడుల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఈఈ టి.హైమావతి, కనిగిరి విద్యుత్ ఈఈ ఆర్ ఉమకాంత్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27 విజిలెన్స్ బృందాలు 1187 విద్యుత్ సర్వీసులను తనిఖీ చయగా 26 సర్వీసుల నుంచి రూ.1,23,400 అపరాధ రుసుం విధించారు. అదనపు విద్యుత్ వినియోగిస్తున్న 11 మంది నుంచి రూ.54,500 15 అక్రమ కనెక్షన్ల వాడుతున్న వారికి రూ.68,900 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో డిప్యూటీ ఈఈ ఏ శ్రీనివాసరావు, ఏఈలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దద్దాల నారాయణ

హనుమంతునిపాడు: స్థానిక ఎస్సీ కాలనీలోకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త దానమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ బుధవారం మృతురాలి ఇంటి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి రూ.10 వేల ఆర్థికసాయం షందజేశారు. కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న రూతమ్మకు రూ.5 వేలు, ఈసాక్‌కు రూ.5 వేల వంతున అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మండల సీనియర్ నాయకులు గాయం బలరామిరెడ్డి, గ్రామ సర్పంచ్ కత్తిరాజారావు, జిల్లా అధికార ప్రతినిధి గాండ్ల పర్తి ఆదినాయణరెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, సర్పంచ్ సంఘ మండల అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, వైస్ సర్పంచ్ ఏరువ వెంకటరెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు కస్తాల బాలాజీ, మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ మౌలాలీ, టీసీ నాయకులు కె.వెంకటకాశయ్య, మాజీ సర్పంచ్ గొబ్బిళ్ల శ్రీనివాస్ మాదవ్ తదితరులు పాల్గొన్నారు,